
కథ

ప్రతాప రవిశంకర్



# ఇన్ని పువ్వులు నాకేనా?

గేటు దగ్గర నిలబడి కాలింగ్ బెల్ నొక్కాడు కైలాసరావు. రోడ్డు మీద ఆటో ఉన్నది. ఆటోలో గోవర్ధనం పీకల దాకా తాగి ఒళ్లు తెలీకుండా పడి ఉన్నాడు.

గోవర్ధనం భార్య హేమలత కొంచెం సేపటికి తలుపు తెరిచింది. కైలాసరావును చూసి "అన్నయ్యగారూ-మీరా! ఆయన ఇంట్లో లేరు" అని చెప్పింది.

"నాకు తెలుసు. వాడిప్పుడు ఆటోలోనే ఉన్నాడు. లోపలకు తీసుకువస్తాం. మంచం వేసి ఉంచు" అని తిరిగి రోడ్డు మీదకు వచ్చాడు.

గేటు బార్లా తెరిచింది హేమలత పరిస్థితిని అర్థం చేసుకుని.

ఆటో డ్రైవర్ సాయంతో గోవర్ధనాన్ని ఇంట్లోకి చేర్చి మంచం మీద పడుకోబెట్టాడు కైలాసరావు. డబ్బులిచ్చి పంపాడు ఆటో డ్రైవర్‌ని.

హేమలత చెప్పిన మీదట మధ్య గదిలో ఓ పక్కగా ఉన్న కుర్చీలో కూర్చున్నాడు.

ఆమె ఏడుస్తోంది. ముందు గదిలో పిల్లలు చదువుకుంటున్నారు. కైలాసరావుకు ఇబ్బందిగా ఉంది. గోవర్ధనం మంచం మీద స్పృహ లేకుండా పడి ఉన్నాడు.

కైలాసరావు బార్‌లోకి వెళ్లేసరికి మిత్రుడు గోవర్ధనం బాగా తాగి బల్ల మీద తలవాల్చి పడి ఉన్నాడు. ఆ స్థితిలో అతడిని చూసి, ముందు అతడిని ఇల్లు చేర్చాలని అప్పటికప్పుడు ఆటోని పిలిచి గోవర్ధనాన్ని ఇల్లు చేర్చాడు. తర్వాత తను బార్‌కు వెళ్లి తాగుదామనుకున్నాడు.

కైలాసరావు లేచి వెళదామనుకుంటున్నప్పుడు ఏడుపు మధ్యలో అన్నది హేమలత.

"అన్నయ్యగారూ... ఈ తాగుడులో ఏం సుఖం ఉన్నదో నాకు అర్థం కావడం లేదు. ఇంటి గురించి పట్టించుకోవడం లేదు. డబ్బంతా తాగుడుకు తగలేస్తున్నారు. లేని సుఖాన్ని వెతుక్కుంటూ మా అందరికీ నరకాన్ని చూపిస్తున్నారు. జీవితంలో సుఖం, సంతోషం అనేవి లేకుండా చేశాడు మీ స్నేహితుడు. పిల్లలు పెద్దవాళ్లవుతున్నారు. ఇలాంటి తండ్రిని పిల్లలు ప్రేమగా, గౌరవంగా చూడగలరా? పెళ్లికి ఎదుగుతున్న ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. డబ్బంతా తాగుడికే తగలేస్తున్నప్పుడు పిల్లల భవిష్యత్తు ఏమిటి? మీరే చెప్పండి అన్నయ్యగారూ" అన్నది కైలాసరావుతో.

అతడు మాట్లాడలేదు. అతనూ, గోవర్ధనం ఒకే ఆఫీసులో పనిచేస్తున్నారు. రోజూ బార్‌లో ఇద్దరూ కలిసే తాగుతారు. ఎందువల్లనో ఆ రోజు గోవర్ధనం ముందుగా వెళ్లాడు.

హేమలత మళ్లీ మొదలుపెట్టింది.

"వర్తమానంలో దిగులుతో పాటు నాకు భవిష్యత్తు గురించి భయం కూడా ఎక్కువయ్యింది. చివరకు మా సంసారం ఏమవుతుంది? ఆయన ఆరోగ్యం పాడవ్వడం మొదలయ్యింది. ఆయనకు ఏమయినా అయితే మాకు దిక్కెవరు? చదువుకున్నవాడనీ, తెలివితేటలున్నాయనీ, ఉద్యోగం చేస్తున్నాడనీ ఆయనకు నన్నిచ్చి పెళ్లి చేశారు. కానీ ఆయన ఇలా తాగుడికి బానిస అయినప్పుడు ఇక ఆయన చదువుకీ, తెలివితేటలకీ, ఉద్యోగానికీ విలువేమిటి? ప్రయోజనం ఏమిటి? ఆయన తాగుడి గురించి బంధువుల్లో అందరికీ తెలుసు. అందుకే వాళ్లకు ఈయనంటే గౌరవం లేదు. ఈయన మాటకు విలువ లేదు. ఒక మనిషి ఇంతటి హీనస్థితికి దిగజారడం సబబేనా? ఇంత మందిని బాధపెడుతూ తానొక్కడే సుఖపడాలనుకోవడం న్యాయమేనా? ఆయన స్నేహితుడిగా మీరు చెప్పండి అన్నయ్యగారూ?" అని కైలాసరావును నిలదీసింది హేమలత ఏడుస్తూనే.

కైలాసరావుకు దిక్కుతోచలేదు. అతడికి హేమలత స్థానంలో తన భార్య వనజ నిల్చుని ఆ ప్రశ్నలన్నీ అడుగుతున్నట్లు అనిపించింది.

నిజానికి గోవర్ధనానికీ, కైలాసరావుకీ భేదం లేదు. కైలాసరావు కూడా అలాంటి జీవితాన్నే గడుపుతున్నాడు. హేమలత స్థానంలో వనజా, గోవర్ధనం స్థానంలో తనూ ఉన్నారు. అంతా ఒకే రకమైన పరిస్థితుల్లో ఉన్నారు. అదే తప్పు చేస్తున్న తను మరో మనిషి గురించి న్యాయం చెప్పగలడా? సాధ్యం కాదు.

తల విదిలించాడు కైలాసరావు. హేమలత ఏడుపు, ఆమె మాటలు అతడిని తీవ్రంగా ఆలోచింపజేశాయి.

నిజానికి తను చేస్తున్నదేమిటి? తను తన భార్య వనజను సుఖంగా, సంతోషంగా బతకనిస్తున్నాడా? పిల్లల భవిష్యత్తు గురించి ఆలోచిస్తున్నాడా? ఇప్పటివరకూ తాను ఎంత డబ్బును ఈ తాగుడు కోసం తగలేశాడు? తల్చుకుంటే గుండె బరువెక్కింది.

ఒక్క క్షణం కూడా అక్కడ కూర్చోలేకపోయాడు. ఏదో అర్జెంటు పనుందనీ, వెళ్లాలనీ ఆమెతో చెప్పి బయటకు వచ్చి రోడ్డుమీద నడవటం మొదలుపెట్టాడు కైలాసరావు.

రోడ్డుమీద నడుస్తూ తను గడుపుతున్న జీవితాన్ని సమీక్షించుకోవటం ప్రారంభించాడు. గోవర్ధనమే కాదు తను కూడా తన భార్యాపిల్లలకు నరకాన్ని చూపిస్తున్నాడని అతనికి అర్థమయింది.

అలా నడుస్తూ కైలాసరావు ఫ్లవర్ మార్కెట్ వీధిలోకి మళ్లాడు. దుకాణాలు తెరిచే ఉన్నాయి. ఆ వీధిలోకి వెళ్లగానే మల్లెపూవు వాసన గుబాళించింది. అతనికి ఒకప్పటి తన అలవాటు గుర్తుకు వచ్చింది. తన పెళ్లయిన కొత్తల్లో మల్లెపూలు వచ్చినంత కాలం తను రోజూ బజారు నుంచి భార్యకు మల్లెపూలు కొనుక్కుని వెళ్లేవాడు. తాగుడు మొదలయిన తర్వాత ఆ అలవాటు అదుగంటిపోయింది. తను ఇష్టపడి పెళ్లి చేసుకున్న భార్యను ప్రేమించడం కూడా మరచిపోయాడా? అతడికి భయమేసింది.

కైలాసరావు మల్లెపూలు అమ్మే దుకాణం ముందు ఆగాడు. బేరం చెయ్యకుండానే వంద రూపాయల మల్లెపూలను కొన్నాడు.

పూలు అమ్మే ఆడమనిషి కైలాసరావుకేసి ఆశ్చర్యంగా చూస్తూ "కొత్తగా పెళ్లయ్యిందా?" అనడిగింది నవ్వుతూ.

"అవును. కొత్త జీవితంలో మొదటి రాత్రి" అన్నాడు కైలాసరావు.

"అదేమిటి?" అన్నది ఆమె.


"నీకు తెలీదులే" అని ఆమె చేతిలో నుంచి ఆ పెద్దదిగా ఉన్న మల్లెపూల పొట్లాన్ని తీసుకుని అటుగా ఖాళీగా వెళుతున్న రిక్షాను ఆపి తన ఇంటి ఎడ్రసు చెప్పి ఎక్కి కూర్చున్నాడు.

రిక్షాలో వెళుతున్నప్పుడు అతడికి తన చిన్నతనం, అమ్మా నాన్నా గుర్తుకువచ్చారు.

తనకు బాగా గుర్తు. అమ్మా నాన్నా ఎంతో అన్యోన్యంగా ఉండేవాళ్లు. నాన్న దూర ప్రాంతంలో ఏ ఊరు వెళ్లినా అమ్మ కోసం అంటూ ఏదో ఒక వస్తువును తప్పకుండా తీసుకువచ్చేవాడు. ఆ వస్తువును చూసి అమ్మ తెగ సంతోషపడేది.

ఒకసారి నాన్న తన స్నేహితులతో కలిసి కన్యాకుమారి వెళ్లి వచ్చినప్పుడు తన ఇంట్లో బంధువులు వచ్చి ఉన్నారు. నాన్న తన కోసం తీసుకువచ్చిన గవ్వల కుంకుమ బరిణెను చూసి ముచ్చటపడి తన ఇంట్లో ఉన్న బంధువులామెకు చూపించింది సంతోషంగా.

ఆమె దాన్ని చూసి అటూ ఇటూ తిప్పి "ఇది పాతిక రూపాయలకు మించి ఉండదు. దీనికే అంత సంతోషపడుతున్నావు" అన్నది అక్కసుగా పెదవి విరిచి.



"దీని వెల పాతిక రూపాయలే కావచ్చు. నేను ఈ వస్తువు వెల గురించి ఆలోచించ లేదు. కానీ అంతదూరం నుంచి నన్ను గుర్తుపెట్టుకొని ఈ వస్తువును నాకోసం తీసుకువచ్చిన మనిషికి నామీద ఉన్న ప్రేమకీ, అభిమానానికీ విలువ కడతాను. అది అమూల్యం. ఏ భర్తయినా భార్యను సంతోషపెట్టడానికి లక్షలు ఖర్చు చేయాల్సిన అవసరం లేదు. ఇది నీకోసం తెచ్చాను అంటూ గడ్డిపోచను తీసుకువచ్చి ఇచ్చినా భార్య సంతోషపడుతుంది. తీసుకునే వస్తువు విలువను కాకుండా ఇచ్చే మనిషి హృదయాన్ని చూడాలి" అని అలా అన్న బంధువులామె నోరు మూయించింది అమ్మ.

ఆ క్షణాల్లో అమ్మ మొహంలో కనిపించిన సంతోషమూ, కళ్లలో మెరుపూ తనకు ఇప్పటికీ గుర్తు. తను మరచిపోలేదు. తండ్రిలాగా తను కూడా వనజకు అటువంటి సంతోషాన్ని కలిగించలేదా? తన పిల్లలు మాత్రం తన తల్లి మొహంలో సంతోషాన్ని చూడాలని ఆశించరా? తనెంత స్వార్థపరుడు? తన తండ్రి స్థానంలోకి తను, తన తల్లి స్థానంలోకి తన భార్య వనజ మారాలి. అప్పుడు తన జీవితం స్వర్గం అవుతుంది. జీవితం చాలా విలువైనదనుకున్నాడు కైలాసరావు.

అతను ఆలోచనల్లో ఉన్నప్పుడే రిక్షా ఆగింది అతని ఇంటిముందు. దిగి, రిక్షా మనిషికి డబ్బులిచ్చి వెళ్లి డోరు బయట నిలబడి కాలింగ్ బెల్ నొక్కాడు.

వనజ తలుపు తీసింది. అతను లోపలకు వెళ్లి తన చేతిలో ఉన్న పెద్ద మల్లెపూల పొట్లాన్ని భార్యకు ఇచ్చాడు.

పిల్లలు చదువుకుంటున్నారు.

అతని భార్య మూడు కారణాలకి ఆశ్చర్యపడింది. ఒకటి, కైలాసరావు రోజూ కంటే చాలా ముందుగా ఇంటికి వచ్చాడు. రెండు, అతను లోపలకు రాగానే రోజూలా గుప్పుమని బ్రాందీ వాసన రాలేదు. మూడు, అతను పెద్ద మల్లెపూల పొట్లాన్ని తీసుకువచ్చాడు.

"ఈ మార్పుకు కారణం ఏమిటో తెలుసుకోవచ్చునా?" అనడిగింది వనజ నవ్వుతూ, అతను బట్టలు మార్చుకుంటున్నప్పుడు.

"ఇన్నాళ్లూ స్వర్గం ఎక్కడో ఉందనుకున్నాను. కానీ అది మన ఇంట్లోనే ఉందని తెలిసింది" అన్నాడు కైలాసరావు నవ్వి.

వనజ అప్పటికప్పుడు ఆ మల్లెపూల పొట్లాన్ని బల్లమీద ఉంచి ఊడదీసి ఆశ్చర్యంగా "ఇన్ని పువ్వులు నాకేనా?" అని అడిగింది సంతోషంగా.పిల్లలు కూడా చూశారు.

"అవును. అన్ని పువ్వులూ నీకే వనజా" అన్నాడు కైలాసరావు.

"ఇంతకీ అసలు విషయం చెప్పనే లేదు" అన్నది వనజ.

"భోజనాలు చేసి పడుకున్న తర్వాత చెబుతాను... భోజనాలు సిద్ధం చెయ్యి. స్నానం చేసి వస్తాను" అన్నాడు కైలాసరావు.

అలా అంటున్న అతని మొహంలో కనపడుతున్న కొత్త కాంతిని వింతగా చూశారు కైలాసరావు భార్యాపిల్లలు.